సాక్షి
జనగామ
ఆదివారం | 26 | నవంబర్ | 2023



గోదావరికి హారతి

కార్తీమాసం పంచరత్నాల్లో భాగంగా శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ చతుర్ధశిని పురస్కరించుకొని గోదావరి నదికి పంచహారతి నిర్వహించారు.

- 6లో ▸



ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు కేయూ జట్లు

సౌత్, వెస్ట్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ రెజ్లింగ్ టోర్నమెంట్‌కు కేయూ జట్లను ఎంపిక చేసినట్లు ఆచార్య శ్రీనివాస్‌రావు తెలిపారు.

- 6లో ▸

గరిష్టం/కనిష్టం
$30^0 / 21^0$

వాతావరణం

ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతమై జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రాత్రి చలి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

వైభవంగా వారకల్యాణం



చిల్పూరు: శ్రీబుగులు వేంకటేశ్వరాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శనివారం స్వామివారికి వార కల్యాణం వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు వేడుకను తిలకించారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. మోకాళ్ల సుధాకర్‌రెడ్డి-రజనీ, వైట్ల వెంకటేశ్వర్లు-నిర్మల దంపతులు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ శ్రీధర్‌రావు పర్యవేక్షించారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, కుంచాల సంపత్‌రాజు, వేల్పుల గట్టయ్య, జంగిటి కుమార్, శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



బచ్చన్నపేట : ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని బిషప్ సంస్థల ఉమ్మడి వరంగల్ అధ్యక్షుడు ఉడుముల బాల అన్నారు. శనివారం స్థానిక బిషప్ తుమ్మ బాల పాఠశాలలో ప్రిన్సిపాల్ తాటికొండ జోసఫ్ అధ్యక్షతన జరిగిన 10వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



జనగామ రూరల్: ప్రభుత్వం విద్యార్థుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది.. అవసరమైన వసతులు కల్పిస్తోంది.. వాటిని వినియోగించుకుని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని టీఎస్ జీసీసీ డీజీఎం సాంబశివరావు అన్నారు. మండలంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలతోపాటు పలు స్కూళ్లను శనివారం జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి ప్రేమకళతో కలిసి సందర్శించారు. చంపక్‌హిల్స్ ఆశ్రమ పాఠశాలలో పిల్లలకు కల్పించిన సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ లచ్చిరాం తదితరులు ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగం గడువు పొడిగించాలి



జనగామ రూరల్: పోలింగ్ సిబ్బందికి ఇచ్చే పోస్టల్ బ్యాలెట్ వినియోగం తేదీ గడువు పొడిగించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చంద్రశేఖర్‌రావు, ఆకుల శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోస్టల్ బ్యాలెట్ నమోదు చేసుకున్న ఉపాధ్యాయుల్లో కొంత మందికి బ్యాలెట్ పేపర్లు రానందున గడువు పెంచాలన్నారు. ఉద్యోగులకు నింబధనల ప్రకారం టీఏ, డీఏలు పని చేసిన చోటు నుంచి 30 కిలోమీటర్లు దాటిన వారికి అదనంగా రూ.750 చెల్లించాలని కోరారు. అలాగే ఎన్నికల విధులు ముగిసిన వెంటనే విధులకు హాజరు కాలేకపోతారని, వారికి సెలవు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

కేయూ ఎంసీఏ పరీక్షలు

కేయూ క్యాంపస్: కేయూ పరిధి ఎంసీఏ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ (నాన్ సీబీసీఎస్ థర్డ్ ఇయర్ డ్యూరేషన్) ఎక్స్ విద్యార్థులకు డిసెంబర్ 6 నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 6, 11, 14, 18, 21 తేదీల్లో పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉంటాయని పేర్కొన్నారు. కాగా.. ఎంసీఏ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు (నాన్‌సీబీసీఎస్) థర్డ్-ఇయర్ డ్యూరేషన్) ఎక్స్ విద్యార్థులకు డిసెంబర్ 6, 11, 14, 18 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారని వారు వివరించారు.

కాంగ్రెస్ వద్దు.. బీఆర్ఎస్ ముద్దు



పాలకుర్తి రోడ్ షోకు హాజరైన ప్రజలు, పార్టీ శ్రేణులు



బచ్చన్నపేట రోడ్ షోకు హాజరైన ప్రజలు, పార్టీ శ్రేణులు



పాలకుర్తిలో గథ ఎత్తిన మంత్రి హరీశ్‌రావు, విల్లు ఎక్కుపెట్టిన అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు



బచ్చన్నపేట రోడ్ షోలో మాట్లాడుతున్న హరీశ్‌రావు, పక్కన అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

నలభై ఏళ్లలో ఎన్నో చేశా..



నలభై ఏళ్ల నా రాజకీయ జీవితంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టాను. మరోసారి తనకు అవకాశం కల్పించాలి. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సాగు, తాగు నీరు, రోడ్ల అభివృద్ధి, ఇళ్ల నిర్మాణాలు, విద్య వంటి వసతులు కల్పించాను. వల్మిడి, బమ్మెర, పాలకుర్తి గ్రామాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేశాను. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాను.

- ఎర్రబెల్లి దయాకర్‌రావు, పాలకుర్తి అభ్యర్థి

అభివృద్ధికి పట్టం కట్టండి..



ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే నాయకుడికి పట్టం కట్టాలి. ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే పాలేరుగా పని చేస్తాను. పూర్తి స్థాయిలో ప్రజల సేవకు సమయం కేటాయిస్తాను. మీరు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తాను. 30వ తేదీ ఎన్నికల్లో అందరూ కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మేజార్టీతో గెలిపించాలి.

- పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగామ అభ్యర్థి

మళ్లీ నాటి కష్టాలు తెచ్చుకోవద్దు

- దయాకర్‌రావు, రాజేశ్వర్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి
- ఎర్రబెల్లి గెలిస్తే సీనియర్ పవర్‌ఫుల్ మంత్రి అయితడు
- రాష్ట్ర మంత్రి తన్నీరు హరీష్‌రావు
- పాలకుర్తి, బచ్చన్నపేటలో బీఆర్ఎస్ రోడ్ షో

పాలకుర్తి/పాలకుర్తిటౌన్/బచ్చన్నపేట : కాంగ్రెస్ రిస్కు వద్దు.. నాటి కష్టాలు మళ్లీ తెచ్చుకోవద్దు.. బీఆర్ఎస్ ముద్దు.. కారు గుర్తుకు ఓటు వేసి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం పాలకుర్తిలో బీఆర్ఎస్ అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు, బచ్చన్నపేటలో జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపు కోసం నిర్వహించిన రోడ్ షోలలో ఆయన మాట్లాడారు. పాలకుర్తిలో ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టు స్టేట్ చైర్మన్ డాక్టర్ ఎన్.సుధాకర్‌రావుతో కలిసి పాల్గొన్నారు. పాలకుర్తిలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. 'ఎలక్షన్లు ఉన్నా లేకున్నా.. ఆపద సంపదకు స్పందించే.. అందరి నోట్లో నాలుకలా ఉండే దయన్న కావాలా.. అమెరికా నుంచి నోట్ల కట్టలతో వచ్చిన ఎన్ఆర్ఐ కావాలా.. అని ప్రజలను అడిగారు. కరోనా వచ్చినప్పుడు నా దగ్గరికి వచ్చి ప్రత్యేక కోటాలో మందులు తెచ్చుకుని మిమ్మల్ని కాపాడుకున్న దయన్న.. ఏ ఊరుకెళ్లినా సీసీ రోడ్లు వేసి మట్టి అంటకుండా చేయలేదా అని గుర్తుచేశారు. ఇంటింటికీ తాగునీరు, కాల్వలకు సాగు నీరు వంటి మౌలిక వసతులు కల్పించిన ఎర్రబెల్లిని ఓడించేందుకు కాంగ్రెస్‌లో టికెట్లు కొన్నవాళ్లు మిమ్మల్ని కొనగలరా అని ప్రశ్నించారు. దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, బమ్మెర పోతన, పాల్కురికి సోమనాథుడి బిడ్డలను కన్న పాలకుర్తి గడ్డలో లీడర్లను కొన్నారేమో కానీ ఆత్మగౌరవం కలిగిన ప్రజలను కొనలేరని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి చెప్పినట్టు మూడు గంటల కరెంటు అమలు చేస్తే తిరిగి రాత్రి పూట రైతులు చావులు మొదలవుతాయి. కాంగెసోళ్ల మాటలకు మోసపోతే గోస పడతం.. కరెంటు కావాలా.. కాంగ్రెస్ కావాలా తేల్చుకోవాలని అన్నారు. రైతు రుణమాఫీ 75 వర్తింపజేశామని, ఎలక్షన్ కమిషన్ అనుమతిస్తే 25 శాతం కూడా మాఫీ చేస్తామని పేర్కొన్నారు. పన్నెండోసారి అమలు చేసే రైతు బంధు ఎకరానికి రూ.16వేలు అందజేస్తామని స్పష్టం చేశారు. ఆసరా పథకం రూ.2వేల నుంచి రూ.5 వేలకు పెంచుతామని కేసీఆర్ చెప్పినట్లు తెలిపారు. మారుమూల గిరిజన తండాలను జీపీలుగా మార్చి స్వపరిపాలనకు శ్రీకారం చుట్టామని, దయాకర్‌రావును అత్యధిక మెజారిటీతో గెలిపిస్తే ఈసారి గిరిజన బంధు ఇస్తామని, పాలకుర్తి రూపురేఖలు మరింత మారుతాయి.. అంతేకాదు ఎర్రబెల్లి సీనియర్ మంత్రి అయితడు.. పాలకుర్తిలో గులాబీ జెండా ఎగురాలని అన్నారు.

కాంగ్రెస్ హయాంలో నానా కష్టాలు

రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ హయాంలో నానా కష్టాలు పడ్డారు.. మళ్లీ ఆ పార్టీకి ఓటువేసి కష్టాలు తెచ్చుకోవద్దని మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బచ్చన్నపేటలో నిర్వహించిన రోడ్ షోలో ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. 20 ఏళ్ల క్రితం తెలంగాణ సాధన ఉద్యమ సమయంలో బచ్చన్నపేటలో పనిచేశాను.. అప్పుడు వ్యవసాయానికి సరిపడా కరెంటు లేక రాత్రి పూట రైతులు బావుల వద్దకు వెళ్లి ప్రమాదాల బారిన పడేవారని అన్నారు. మహిళలు తాగు నీటిని చాలా దూరం వెళ్లి తెచ్చుకునేవారని, ఇక్కడి పరిస్థితులను స్వయంగా చూసిన సీఎం కేసీఆర్ కన్నీళ్లు పెట్టుకున్న సందర్భాలున్నాయని అన్నారు. కరువుతో అల్లాడిన ఈ ప్రాంతం ఇప్పుడు గోదావరి జలాలతో కళకళలాడుతున్నదని చెప్పారు. ఒకనాడు చేయడానికి పనులు లేక స్థానికులు వలస వెళ్లారు.. నేడు వ్యవసాయ పనులకు కూలీలు దొరక్క బిహార్ నుంచి తెప్పించుకునే స్థితికి వచ్చామని వివరించారు. సర్కారు దవాఖాన అంటే మేము పోము అన్న రోజుల నుంచి సర్కార్ దవాఖానలే ముద్దు అన్న స్థాయికి తెచ్చామని అన్నారు. సీఎం కేసీఆర్ మహిళలకు సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా రూ.5వేల పింఛన్ ఇవ్వనున్నారని, అలాగే ప్రతి నెలా సన్నబియ్యం, రూ.400కే గ్యాస్ సిలిండర్ అందజేస్తామన్నారు. కర్ణాటక రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌తో ఇబ్బందులు పడుతున్నారని, కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అమలుకు సాధ్యం కాని హామీలిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు కావాలంటే కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో శాసన మండలి మాజీ చీఫ్‌విప్ బి.వెంకటేశ్వర్లు, జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ రమణారెడ్డి, నాయకులు చల్ల శ్రీనివాస్‌రెడ్డి, బొడిగం చెంద్రారెడ్డి, గంగం సతీష్ రెడ్డి, మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, ఉపేందర్ రెడ్డి, షబ్బీర్, సందీప్, సిద్దిరాంరెడ్డి, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అబద్ధపు మాటలు నమ్మొద్దు

- కర్ణాటక రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్



ఎన్నికల ప్రచారంలో మంత్రి శివరాజ్

జనగామ/నర్మెట: కర్ణాటక రాష్ట్రంలో ఎన్నికల సమయాన ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి మాట నిలబెట్టుకుంటున్నాం.. బీఆర్ఎస్ అబద్ధపు మాటలు నమ్మొద్దని ఆ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడిన ఆయన.. నర్మెటలో కాంగ్రెస్ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. కర్ణాటకలో ఎన్నికల హామీలు అమలు చేయడం లేదని బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అక్కడ గృహజ్యోతి పథకం కింద ప్రతీ ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని చెప్పారు. గృహలక్ష్మి కింద ప్రతీ ఇంటి యజమాని ఖాతాలో నెలకు రూ.2వేలు జమ చేస్తున్నామని, డిగ్రీ, డిప్లొమా పూర్తయిన పట్టభద్రులు, అభ్యర్థులకు రూ.1,500 నుంచి రూ.3,000 'యువ నిధి' సాయం అందజేస్తున్నట్లు వివరించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే మేనిఫెస్టోలోని హామీలన్నీ అమలు చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు ఉల్లెంగుల కృష్ణ, వడ్డెర సంఘం నాయకుడు మల్లేష్ కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి మంత్రి కండువా కప్పి స్వాగతించారు. యువ నాయకులు కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి, టీపీసీసీ మెంబర్ చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, బక్క శ్రీనివాస్, కందుకూరి కైలాసం, అంజిరెడ్డి, మల్లారెడ్డి, చందు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వద్దు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివలింగయ్య



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్

జనగామ రూరల్/స్టేషన్‌ఘన్‌పూర్/పాలకుర్తి టౌన్: ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దు.. పకడ్బందీ ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివలింగయ్య అన్నారు. శనివారం జనగామ పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో చేపట్టిన ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. అలాగే స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి డివిజన్ కేంద్రంలోని ఆర్ఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం) ర్యాండమైజేషన్ ప్రక్రియ, పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాల నిర్వహణ ఏర్పాట్లు, కొత్తపల్లిలో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్, పీడబ్ల్యూడీ, 80 ఏళ్ల పైబడిన వృద్ధులకు సంబంధించి ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతున్నదని వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, నోడల్ అధికారులు కొండల్‌రెడ్డి, మొగిలప్ప, ఘన్‌పూర్, పాలకుర్తి ఆర్ఓ వాసం రామ్మూర్తి, డీటీ విజయ్, ఆర్ఐలు అర్జున్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ వినోద్‌కుమార్

ఓటు హక్కు అత్యంత విలువైనదని.. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వినియోగించుకోవాలని స్వీప్ నోడల్ అధికారి వినోద్‌కుమార్ అన్నారు. శనివారం జనగామ మండలం యశ్వంతాపూర్‌లోని జిప్స్ ఫార్మసీ కళాశాలలో కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ వరంగల్ ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఇందుకు ఎన్నికల సంఘం ఏడాదికి నాలుగు సార్లు అవకాశం కల్పించిందని చెప్పారు. కార్యక్రమంలో డీపీఆర్వో రాజేంద్రప్రసాద్, ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ శ్రీధర్, కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌రెడ్డి, రాము పాల్గొన్నారు.

నేడు క్షీరగిరిపై అఖండజ్యోతి

- దీప ప్రజ్వలనం.. గిరి ప్రదక్షిణ
- ముస్తాబైన శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయం



విద్యుత్ దీపాల వెలుగులో సోమేశ్వరస్వామి గుట్ట

పాలకుర్తి టౌన్: శబరిమల మకరజ్యోతి మాదిరిగా క్షీరాద్రి శిఖరమైన పాలకుర్తి శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి క్షేత్రంలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని ఆదివారం 'అఖండజ్యోతి', గిరి ప్రదక్షిణకు ఏర్పాట్లు చేశారు. తిరువన్నామలై అరుణాచలం స్ఫూర్తితో పాలకుర్తి క్షీరగిరిపై 8 అడుగుల వెడల్పు, 4 అడుగుల ఎత్తులో ప్రత్యేకంగా రూపొందించిన భారీ ప్రమిదలో ఒక టన్ను నువ్వుల నూనె, ఆవు నెయ్యి, 2 క్వింటాళ్ల ముద్ద కర్పూరంతో అఖండజ్యోతిని వెలిగిస్తారు. వేలాదిగా తరలివచ్చే భక్తుల సమక్షంలో లక్ష దీపోత్సవం, గిరి ప్రదక్షిణ, అఖండజ్యోతి 6.00 గంటలకు ప్రారంభం అవుతుంది. అఖండజ్యోతికి అవసరమై నూనె, వత్తులు, కర్పూరాన్ని భక్తుల నుంచి సేకరించారు. ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసు బందోబస్తు, అవసరమైన ఏర్పాట్లు చేశామని ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న తెలిపారు. ఇదిలా ఉండగా.. అఖండజ్యోతిని ప్రారంభించడానికి ఉత్తరకాశి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వామి స్థితప్రజ్ఞానంద సరస్వతి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు.

లిక్కర్‌పై ఫోకస్

- 28న సాయంత్రం 5 గంటలకు మద్యం దుకాణాలు బంద్
- డిసెంబర్ ఒకటిన తిరిగి ప్రారంభం
- మళ్లీ 3వ తేదీన కౌంటింగ్ రోజు క్లోజ్
- డంపింగ్ చేస్తున్న రాజకీయ పార్టీలు
- హైదరాబాద్ ఇతర ప్రాంతాల నుంచి మద్యం తరలింపు



జనగామ: అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి మరో మూడు రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఈనెల 28న సాయంత్రం 5 గంటలకు ప్రచారానికి తెరపడనుంది. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం ఆయా పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఉదయం లేచింది మొదలు రాత్రి 10 గంటల వరకు పర్యటనలు చేస్తున్నారు. ప్రచార సమయం దగ్గర పడడంతో.. పోల్ మేనేజ్‌మెంటుపై దృష్టి సారిస్తున్నారు. పోలింగ్ ప్రారంభమయ్యే వరకు డబ్బులు ఎంత ముఖ్యమో.. మద్యం బాటిళ్లను చివరి అస్త్రంగా ఉపయోగిస్తారు. ఓటింగ్‌కు 48 గంటల ముందు జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాలను మూసి వేస్తారు. ఎలక్షన్ కమిషన్ నియమ నిబంధనలు అనుసరించి ఈనెల 28వ తేదీ సాయంత్రం 5 నుంచి 30వ తేదీ వరకు వైన్స్ మూసి వేయాలి. డిసెంబర్ ఒకటిన ఉదయం తిరిగి తెరుస్తారు. మళ్లీ ఓట్ల లెక్కింపు రోజు 3వ తేదీ సైతం మద్యం దుకాణాలు మూసి వేయాల్సి ఉంటుంది.


ఒకటో తేదీ నుంచి కొత్త వ్యాపారం

రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 30 వరకు వైన్స్ రెండేళ్ల కాల పరిమితి ముగియనుంది. డిసెంబర్ 1 నుంచి నూతన మద్యం దుకాణాలు తెరుచుకో బోతున్నాయి. ఎన్నికల నేపథ్యంలో రెండున్నరోజులు ముందుగానే ప్రస్తుత యజమానులు దుకాణాలను క్లోజ్ చేసుకునే పరిస్థితి నెలకొంది.

ఓటర్లు, కేడర్‌కు పంపిణీ చేయడానికి డంపింగ్..!

జిల్లాలోని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల పరిధిలో ఓటర్లతో పాటు కేడర్‌కు లిక్కర్ బాటిళ్లు పంపిణీ చేసేందుకు ఆయా రాజకీయ పార్టీలు పెద్ద ఎత్తున ముందస్తుగా డంపింగ్ చేస్తున్నట్లు సమాచారం. జిల్లా పరిధిలో 47 మద్యం దుకాణాలు ఉండగా.. పక్క నియోజకవర్గాల నుంచి సైతం ఇక్కడికి లిక్కర్‌తో పాటు బీర్లు తరలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎక్సైజ్ శాఖ నిబంధనలను అనుసరించి స్థానిక మద్యం దుకాణాలకు డిపో నుంచి స్టాక్ పంపిస్తున్నారు. అదనపు అమ్మకాలు జరిపితే వైన్స్ యజమానులు అందుకు సంబంధించిన లెక్క చూపించాల్సి ఉంటుంది. దీంతో గతంలో మాదిరిగానే స్టాక్ తెప్పిస్తుండడంతో ఆయా పార్టీలు తమకు అవసరమైన మద్యాన్ని హైదరాబాద్, ఇతర జిల్లాల నుంచి తీసుకువస్తున్నట్లు సమాచారం, కాగా గ్రామాల్లో బెల్ట్ దుకాణదారులు సైతం రహస్య ప్రాంతాల్లో లిక్కర్‌ను డంపింగ్ చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

28 సాయంత్రం 5 గంటలకు క్లోజ్ చేయాలి



ఎన్నికల నేపథ్యంలో ఓటింగ్‌కు 48 గంటల ముందు ఈనెల 28న సాయంత్రం 5 గంటలకు జిల్లాలోని 47 మద్యం దుకాణాలతో పాటు బార్లు మూసి వేయాలి. ఇటీవల టెండర్లలో లైసెన్సులు దక్కించుకున్న నూతన వ్యాపారులు డిసెంబర్ 1 నుంచి తమ దుకాణాలు ఓపెన్ చేయాలి. 3వ తేదీ కౌంటింగ్ రోజు మూసి వేసి తిరిగి నాలుగో తేదీ ఉదయం అమ్మకాలు ప్రారంభించాలి.

- కృష్ణప్రియ, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి

- జిల్లా సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి విక్రమ్

జనగామ రూరల్: భారత రాజ్యాంగం కల్పించిన చట్టాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్ అన్నారు. నేషనల్ లీగల్ డేను పురస్కరించుకొని జనగామ పట్టణంలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం ఏర్పాటు, ప్రాథమిక హక్కుల(ఆర్టికల్ 12 నుంచి 35) గురించి వివరించారు. ఆర్టికల్ 14 ప్రకారం చట్టం ముందు అందరూ సమానులే అని, 19 స్వేచ్ఛా స్వాతంత్ర్యం, ఆర్టికల్ 21(ఏ) విద్యాహక్కు గురించి తెలుపుతుందని వివరించారు. 24వ ఆర్టికల్ బాల కార్మిక వ్యవస్థ నిషేధం గురించి తెలుపుతుందని, బాల కార్మికులు ఎక్కడైనా కనిపిస్తే ఒక లేటర్ ద్వారా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఇన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవ చేసేందుకే వచ్చాం



రాయపర్తి : ప్రచారంలో మాట్లాడుతున్న యశస్వినిరెడ్డి



దేవరుప్పుల : కొత్తకాలనీ ప్రచారంలో పాల్గొన్న కృష్ణమూర్తి

- కాంగ్రెస్ పాలకుర్తి అభ్యర్థిని యశస్విని రెడ్డి
- కోలాటాలు, డప్పుచప్పుళ్లతో స్వాగతం పలికిన ప్రజలు

రాయపర్తి : మేం ఆస్తులు కూడబెట్టేందుకు రాజకీయాల్లోకి రాలేదని, ప్రజాసేవ చేసేందుకే వచ్చామని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిని మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. పల్లెపల్లెకు కాంగ్రెస్ గడప గడపకు ఝాన్సమ్మ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కిష్టాపురం, పన్యానాయక్ తండాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు కోలాటాలు, డప్పు చప్పుళ్లతో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఎమ్మెల్యేగా గెలిచిన దయాకర్ రావు చేసిన అభివృద్ధి శూన్యం అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే పార్టీ కాంగ్రెస్ అన్నారు. బీఆర్ఎస్ బూటకపు హామీలు ఇస్తుందన్నారు. సొంత ఇంటి కలను నెరవేర్చలేదన్నారు. యువకులకు ఉద్యోగాలు కల్పించాల్సింది పోయి బెల్ట్ షాపులు పెంచి తాగుడుకు బానిసలను చేసిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు ఇళ్లు కట్టుకునేందుకు ఒక్కొక్కరికి రూ.5 లక్షలు, ఎస్సీ ,ఎస్టీలకు రూ.6 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. గిరిజనులకు అండగా కాంగ్రెస్ నిలుస్తుందన్నారు. తనకు వచ్చే జీతాన్ని సైతం ప్రజాసేవకే వినియోగిస్తానన్నారు. కాంగ్రెస్ ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీ స్కీంలు తప్పక అమలు అవుతాయన్నారు. కాంగ్రెస్ గెలుపు తథ్యం అన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ అమ్యా నాయక్,, కుందూరు గోపాల్‌రెడ్డి, సరికొండ కృష్ణారెడ్డి, రెంటాల గోవర్ధన్ రెడ్డి, మాచర్ల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



రాయపర్తి : ప్రచారంలో పాల్గొన్న యశస్వినిరెడ్డి

బీఆర్ఎస్‌కు పట్టంకడితే అధోగతే..

దేవరుప్పుల : బీఆర్ఎస్‌కు మరోసారి నమ్మి పట్టంగడితే నిరుద్యోగ్యులకు శాపంగా మారడమేగాక వనరులు దోపిడీ చేసి మనల్ని అధోగతి పాలు చేయడం ఖాయమని పాలకుర్తి దేవస్థాన కమిటీ మాజీ చైర్మన్ సిలువేరు కృష్ణమూర్తి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కొత్తకాలనీలో పాలకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి యశస్వినిరెడ్డి గెలుపు కోసం ఇంటింటా ప్రచారం చేసి ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కాసారపు ధర్మారెడ్డి, తోటకూరి పాండు కృష్ణ, రమేష్, రామచంద్రారెడ్డి, చెల్మారెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.

అమరుల కలలు సాకారం చేస్తున్న కేసీఆర్

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



దేవరుప్పుల : కడవెండి ప్రచార సభలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల : నాటి, నేటి తెలంగాణ సాధనలో అసువులు బాసిన అమరుల కలలు సాకారం చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి, బీఆర్ఎస్ పాలకుర్తి అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని కడవెండి, ధర్మాపురంలో ఆయన ఎన్నికల ప్రచారంలో ఎర్రబెల్లికి గులాబీ శ్రేణులు సాంస్కృతిక సంప్రదాయాలు, ఆటపాటలతో ఘనస్వాగతం పలికారు. తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య స్మారక విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 50 ఏళ్ల పాలన చేసిన కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధితో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన శాశ్వత ప్రాతిపదికన పనులు, రైతు సంక్షేమ పథకాలను బేరీజు వేసుకోవాలని సూచించారు. తండాల స్వయంసమృద్ధి సాధించే దిశలో స్వపరిపాలన కోసం తండాలను పంచాయతీలు చేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. రేలారేలా గంగవ్వ, కనకవ్వ జానపద గేయాలతో ప్రభుత్వ పథకాలపై రక్తి కట్టించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఐ ఎర్రంరెడ్డి తిరుపతిరెడ్డి, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకుల బెల్లీనా లీనారెడ్డి, దుబ్బాక కవితరత్నాకర్‌రెడ్డి, మదార్, మహేష్, హన్మంతు, అశోక్, ఉపేందర్, కృష్ణమూర్తి, రమేష్, సాయిలు, సతీష్, లాలునాయక్, యాకయ్య, చిరంజీవి పాల్గొన్నారు.

భారీగా తరలిన గులాబీ శ్రేణులు

ఎర్రబెల్లి దయాకర్‌రావు గెలుపు కోసం తలపెట్టిన రోడ్‌షో కోసం మండల వ్యాప్తంగా గులాబీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల సమన్వయకర్త పల్లా సుందర్‌రామిరెడ్డి మాట్లాడుతూ ఇంటింటా కేసీఆర్ సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులు ముచ్చటగా మూడోసారి సీఎం కేసీఆర్, మంత్రి దయన్నకు అత్యధిక మెజారిటీతో పట్టంగట్టడం ఖాయమన్నారు.

మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక

కొడకండ్ల : మండలంలోని చెరువుముందు తండాకు చెందిన గిరిజనులు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. మండల ఇన్‌చార్జ్ భానుకిరణ్‌రావు, బీఆర్ఎస్ నాయకుడు ధరావత్ వీరన్ననాయక్ ఆధ్వర్యంలో తండాకు చెందిన సోమన్న, శ్రీను, యాకూబ్, వెంకన్న, నవీన్ తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు.



దేవరుప్పుల : నీర్మాల నుంచి రోడ్‌షోకు తరలుతున్న గులాబీ శ్రేణులు




కొడకండ్ల : మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన గిరిజనులు

కొండచిలువ హతం

బచ్చన్నపేట : మండలంలోని కొడవటూర్ వద్ద కొండ చిలువను చంపిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామ రైతులు తెలిపిన వివరాల ప్రకారం... కొడవటూర్ సిద్దులగుట్ట వద్ద రోడ్డుకు అడ్డంగా పెద్ద శబ్దం చేస్తూ వెళ్తున్న కొండచిలువను గమనించిన రైతులు కర్రలతో చంపేశారు.రాత్రివేళ వ్యవసాయ బావుల వద్దకు వెళ్లాలంటే భయం వేస్తుందన్నారు.





ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు కేయూ జట్లు

కేయూ క్యాంపస్ : పంజాబ్ రాష్ట్రం మొహాలిలోని చండీఘర్ యూనివర్సిటీలో ఈనెల 28 నుంచి డిసెంబర్ 1 వరకు నిర్వహించబోయే సౌత్ వెస్ట్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ రెజ్లింగ్ టోర్నమెంట్‌కు కాకతీయ యూనివర్సిటీ పురుషుల, మహిళల జట్లను ఎంపిక చేసినట్లు శనివారం కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ఆచార్య శ్రీనివాస్‌రావు తెలిపారు.

రెజ్లింగ్ ఫ్రీ స్టైయిల్ పురుషుల జట్టులో వి.భరత్, ఎస్.కార్తీక్ (న్యూసైన్స్ డిగ్రీ కళాశాల, హనుమకొండ), బి.అఖిల్ (ఎల్‌బీ కాలేజి వరంగల్), ఎన్.నితిన్, బి.అఖిల్ (కేడీసీ హనుమకొండ), ఎ.భాను ప్రకాశ్ (ఐటీడబ్ల్యూ ఆర్‌డీసీ మణుగూరు), రెజ్లింగ్ గ్రేకోరోమన్ పురుషుల జట్టులో సీహెచ్. ప్రియతమ్ (న్యూసైన్స్ డిగ్రీ కాలేజి ,హనుమకొండ), కె.అఖిల్ (వాగ్దేవి డిగ్రీ కాలేజి హనుమకొండ), ఎస్‌డీ.ముబీన్ (యూఏఎస్‌సీ హనుమకొండ), జి.తిరుపతి, ఎస్ వినయ్‌కుమార్ (యూసీపీఈ కేయూ), ఎ.వినోద్ శ్రీకేవీఎస్ డిగ్రీ కాలేజి కురవి, మహబూబాబాద్) ఉన్నారు.

ఉమెన్ కేయూ జట్టు

కేయూ రెజ్లింగ్ మహిళల జట్టులో ఎస్.మహేశ్వరీ, కె.సంతోషి, ఇ.వెన్నెల, కె.రేణుక (ఐటీడబ్ల్యూ ఆర్‌డీసీ కొత్తగూడెం), షేక్ రెహనా (యూఏఎస్‌సీ హనుమకొండ), జె. మాధురి (కేఐవైఎస్ వరంగల్), కె. ఓంప్రశాంతి(టీఎస్‌డబ్ల్యూ ఆర్‌డీసీ వరంగల్‌వెస్ట్), పి.రమ్య (యూసీపీఈ కేయూ) ఉన్నారని తెలిపారు. పురుషుల, మహిళల జట్లకు వరంగల్‌లోని బొల్లికుంట వాగ్దేవి ఫిజికల్ ఎడ్యూకేషన్ కాలేజి ఫిజికల్ డైరెక్టర్ పి.లక్ష్మీపతి మేనేజర్‌గా వ్యవహరిస్తారని ఆయన తెలిపారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

హన్మకొండ అర్బన్ : ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకొనేలా అధికారులు కృషి చేయాలని, ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులందరూ తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని విధిగా ఉపయోగించుకోవాలని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ ఎన్నమనేని జగన్మోహన్‌రావు తీర్మానించారు. శనివారం హనుమకొండ ఐడీఓసీలోని టీజీఓ భవన్‌లో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా యూనిట్ల సంయుక్త కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొని గెజిటెడ్ అధికారుల సమస్యలపై చర్చించి, పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా టీజీఓ వరంగల్ జిల్లా అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు దాసరి మురళీధర్‌రెడ్డి, అంజద్‌అలీ, హనుమకొండ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, ఫణికుమార్, ఈగ వెంకటేశ్వర్లు, నాగనారాయణ, కిరణ్‌కుమార్ గౌడ్, రాజేష్ కుమార్, కంచె వేణు పాల్గొన్నారు.

ప్రచారం కన్నా రహస్య మంతనాలు మిన్న

కాజీపేట: వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో పోటీలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. డివిజన్ల వారీగా ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు ఒకరిని మించి మరొకరు ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నారు. ప్రధాన నాయకులు, కుల సంఘాల పెద్దలు, మహిళా సంఘాలు, యువజన సంఘాల సభ్యులను ప్రసన్నం చేసుకునేందుకు రహస్యమంతనాలు చేస్తున్నారు. విజయానికి అవరోధంగా ఏ అంశాలు ఉన్నాయి. వాటిని ఎలా అధిగమించాలనే ఆలోచనలతో ప్రత్యేకంగా పార్టీల్లోని ముఖ్య నాయకులకు బాధ్యతలను అప్పగించి ముందుకెళ్తున్నారు. కార్మిక, వృత్తిదారుల సంఘాలను తమవైపు తిప్పుకోవడంలో నిమగ్నమయ్యారు. ఇందుకోసం వారితో ప్రత్యేకంగా సమావేశమవుతున్నారు. అవతలి పక్షం నుంచి నేతలు, కార్యకర్తలను రప్పించేందుకు అభ్యర్థులు నానా తంటాలు పడుతున్నారు. అదేసమయంలో ఉన్న వారిని కాపాడుకునేందుకు తిప్పలు పడాల్సిన పరిస్థితి. సభ్యుల సంఖ్యను బట్టి తాయిలాలు అందజేస్తున్నారు. ఉదాహరణకు ఆటో డ్రైవర్లు, ప్రైవేట్ పాఠశాలల డ్రైవర్లు, భవన నిర్మాణ రంగ కార్మికులు ఇలా ఒక్కో వర్గం సంబంధిత సంఘాల్లో సభ్యులను గుర్తించి ప్రత్యేక ప్యాకేజీలను అందజేస్తున్నట్లు సమాచారం. మారిన రాజకీయ ట్రెండ్‌కు అనుగుణంగా వారికి కావాల్సిందే అప్పగిస్తున్నారని వినికిడి. నియోజకవర్గంలో రాజకీయ పార్టీల ప్రచారం కన్నా రహస్య మంతనాలే ఎక్కువగా కొనసాగుతున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జనగామ రూరల్ : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన శనివారం వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారి పెంబర్తి యూటర్న్ వద్ద చోటుచేసుకుంది. మండలంలోని గోపిరాజుపల్లికి చెందిన రంగు బాలనర్సయ్య భార్య గౌరమ్మ ఇద్దరు జనగామ నుంచి పెంబర్తి వెళ్లి యూ టర్న్ మీదుగా బైక్‌పై వెళ్తుండగా హైదరాబాద్ నుంచి జనగామకు వస్తున్న లారీ యూ టర్న్‌పై వస్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. రోడ్డుపై పడిన లారీని ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రొక్లెయిన్‌తో లారీని తొలగించారు. లారీ డ్రైవర్, క్లీనర్ ఇద్దరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఓటమి భయంతోనే ఇందిరపై కడియం ఫిర్యాదు




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మారపాక రవి

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రస్తుత ఎన్నికల్లో ఓటమి చెందుతాననే భయంతోనే బీఆర్ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి కాంగ్రెస్ అభ్యర్థి సింగపురం ఇందిరపై ఆర్ఓకు ఫిర్యాదు చేశారని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, జెడ్పీటీసీ మారపాక రవి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ చేపూరి చిరంజీవి అన్నారు. డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలంయలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అపారమైన రాజకీయ అనుభవం ఉన్న కడియం శ్రీహరి ప్రస్తుత ఎన్నికల నేపథ్యంలో ఇందిరపై ఆర్ఓకు ఫిర్యాదు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. మాదిగలంతా ఏకం కావాలని, నవంబర్ 30న చేతిగుర్తుకు ఓటు వేసి ఇందిరను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గుర్రం యాదగిరి, నాయకులు నాగరబోయిన శ్రీరాములు, కత్తుల కట్టయ్య, నీల శ్రీధర్, ఐలపాక శ్రీను, మారపాక వసంత్, ఏలియా, సుమన్‌నాయక్, చింత జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసైన వ్యక్తి మృతి

రఘునాథపల్లి: భార్య దూరంగా ఉంటుందన్న మనస్తాపంతో మద్యానికి బానిసైన ఓ వ్యక్తి మృతి చెందగా రెండు రోజులుగా ఇంట్లోనే ఉన్న మృతదేహం శనివారం వెలుగులోకి వచ్చిన సంఘటన మండలంలోని కంచనపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంచనపల్లికి చెందిన కొడగాని మాధవరావు (37) ఆయన భార్య అనితకు మూడేళ్ల క్రితం గొడవలు జరిగాయి. అప్పటి నుంచి ఆమె ఇద్దరు పిల్లలతో కలిసి హనుమకొండలో నివాసం ఉంటోంది. భార్య తనతో ఉండటం లేదన్న బాధతో మద్యానికి బానిసై మాధవరావు అనారోగ్యలయ్యాడు. శనివారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో పక్కింటి వారు మృతుడి తండ్రి బాపురావుకు సమాచారం ఇచ్చారు. తండ్రి స్థానికులతో కలిసి కిటికిలో నుంచి ఇంటిలోపల చూశారు. మంచంపై అచేతనంగా పడి ఉండటం..దుర్వాసన వస్తుండంతో మరణించాడని భావించి పోలీసులకు సమాచారమిచ్చారు. 23న ఉదయం 9.30 గంటల సమయంలో గ్రామస్తుడు నవీన్‌తో మాట్లాడిన మాధవరావు తాను ఎన్నికల ప్రచారానికి రానని, ఇంట్లోనే ఉంటానని చెప్పి తలుపులు గడియవేసుకున్నాడు. అప్పటి నుంచి ఆయన బయటకు రాలేదు. ఈ నేపథ్యంలో 23నే మరణించి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

ప్రచారానికి వెళ్లి వస్తూ..



వేణుగోపాల్(ఫైల్)

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని మచ్చాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ దూలం వేణుగోపాల్(45) అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి కోసం గ్రామంలో ప్రచారం చేసి గురువారం రాత్రి ఇంటికి వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపారు. గ్రామంలోని ప్రధాన రోడ్డుపై ద్విచక్రవాహనం నడుపుతూ ఇంటికి వెళ్తున్న క్రమంలో అకస్మాత్తుగా కుక్కలు అడ్డు రావడంతో కింద పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయాలై మెదడు దెబ్బతిందని, ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు వారు పేర్కొన్నారు. కాగా, బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పరకాల ఎమ్మెల్యే అభ్యర్థి రేవూరి ప్రకాశ్‌రెడ్డితోపాటు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరగోని రాజ్‌కుమార్, సర్పంచ్ బోడకుంట్ల ప్రకాశ్ పరామర్శించారు. వేణుగోపాల్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ పోలీసులు తెలిపారు.

గోదావరికి హారతి



కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో కార్తీమాసం పంచరత్నాల్లో భాగంగా వైకుంఠ చతుర్ధశిని పురస్కరించుకొని గోదావరి నదికి పంచహారతి కార్యక్రమాన్ని ప్రధాన అర్చకుడు త్రిపురారి కృష్ణమూర్తిశర్మ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. గోదావరికి పాలు, పండ్లు, పసుపు, కుంకుమతో పాటు సారెను సమర్పించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, ధర్మకర్తలు అడప సమ్మయ్య, కామిడి రాంరెడ్డి, అర్చకులు ప్రశాంత్‌శర్మ, వైకుంఠపాండా, సుబ్రమణ్యశర్మ, రాజరాజేశ్వర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

